రైతులతో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

రెండో జాబితాలో

మరిన్ని కరువు మండలాలు

- తాగునీటికి గాజులదిన్నెలో 2 టిఎంసిల నిల్వ - జడ్‌పి సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన వెల్లడి
- మూడుగంటల్లో ముగించేశారు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కరువు మండలాలు అన్నీ ప్రకటించలేదని ఆందోళన చెందవద్దని రెండో జాబితాలో మరిన్ని కరువుమండలాల వివరాలు ప్రభుత్వానికి ప్రతిపాదించామని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. తాగునీటి అవసరాలకోసం ఎల్ఎల్‌సి నుంచి నీటిని తీసుకుంటున్నామని, గాజులదిన్నె ప్రాజెక్టులో రెండు టిఎంసిలు అదనంగా నిల్వచేయబోతున్నామని మంత్రి వెల్లడించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం, వ్యవసాయం, గహ నిర్మాణ శాఖ అంశాలపై అజెండాగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు హాజరయ్యారు. ఆర్థిక మంత్రి మాట్లాడుతూ గాజులదిన్నె రిజర్వాయరుకు రోజూ 200 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని, ప్రాజెక్టులో 2 టిఎంసి నీటిని నిల్వ చేసి కోడుమూరు తాగునీటి అవసరాలు కూడా తీరుస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద నిధులు పుష్కలంగా ఉన్నాయని, చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు అవుతాయని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న వారిని, కాంట్రాక్టర్లను టెండర్లలో పాల్గొనేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఆళ్లగడ్డ, ఆత్మకూరు ప్రాంతంలో ఇళ్ళ మంజూరుకు సంబంధించి హాబిటేషన్లకు దూరంగా లే అవుట్ లు ఉన్నాయని జడ్‌పిటిసిలు తెలిపిన అంశంపై మంత్రి స్పందిస్తూ తహసీల్దార్ లతో కలిసి ఆ లేఔట్‌లను పునఃపరిశీలించాలని మంత్రి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వీటికి ప్రత్యామ్నాయంగా స్థలాలను చూడాలని సూచించారు. కోడుమూరులో 1140 ఇళ్లు మంజూరు అయ్యాయని, కానీ దూరంగా ఉండడంతో లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకోలేదని జడ్‌పిటిసి మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఈ అంశాన్ని వెంటనే పరిశీలించి వారం లోపు తనకు నివేదిక ఇవ్వాలని మంత్రి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సి స్థాయిలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓను మంత్రి ఆదేశించారు.. కర్నూలు ఉల్చాల రోడ్‌కు డబుల్ రోడ్ ప్రతిపాదనలు పంపాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న సచివాలయాలకు గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.20 లక్షల నుండి రూ.40 లక్షలకు పెంచుతూ ఎమ్మిగనూరు పర్యటనలో ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ మేరకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి ఆదేశించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనుల కోసం పిలిచిన టెండర్ల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించామన్నారు. కర్నూలు (రూరల్), తుగ్గలి మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.. వ్యవసాయానికి సంబంధించి హెచ్ఎస్ఎస్, కెసి కెనాల్ కింద చాలా వరకు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి పంటలు వేసుకున్నామని చెప్తున్నారని, పంటల విషయంలో రైతులు నష్టపోకుండా వ్యవసాయ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ లో ఎక్కువ శాతం మిస్‌మ్యాచెస్ జరుగుతున్నాయని వాటిని నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మృతిచెందిన కల్లూరు జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డికి సంతాపసూచికంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సమావేశం చివర్లో జిల్లా పరిషత్ లో ఉన్న పురాతన భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి పర్యాటక శాఖకు లీజుకు ఇవ్వడం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు. తొంబై రోజులకు ఒకసారి నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం పట్టుమని ఎవ్వరూ పది నిమిషాలు మాట్లాడకుండా 3గంటల్లోనే మమ అని ముగించేశారు. ఇది చివరికి సభ్యులకు, అధికారులకు చర్చనీయాంశంగా మారింది.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మార్కెట్ యార్డులో వ్యాపారుల చేతిలో వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే వ్యాపారులపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. శనివారం వారు మార్కెట్ యార్డులో వేరుశనగ పంటల ధరలను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. క్వింటా వేరుశనగ ధర రూ.5500, అలాగే రూ.7500 ప్రకారం ఉన్నాయని చెప్పారు. ఎకరాకు కేవలం 2, 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని, రూ.50 వేల వరకు ఖర్చుయిందని తెలిపారు. ప్రతి ఎకరాకూ రూ.30 వేలకు పైగా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. క్వింటాకు కనీసం రూ.8 వేల ప్రకారం కొనుగోలు చేయాలని, అలాగే టెండర్ వేసిన వెంటనే వ్యాపారులు గ్రేడింగ్ చేయకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కరువుతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ పాల్గొన్నారు.

మండిన ధరలు...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

దీపావళి అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది కాకరపూల వెలుగులు, టపాసులు ఢాం..ఢాం శబ్దాలు. చాలా మంది అవి లేకుండా దీపావళి పండగ జరుగదు. దీపావళికి కొనుగోలు చేసే టపాసుల ధరలు ఈ ఏడాది మండిపోయాయి. గతేడాది కంటే 20 నుంచి 25 శాతం వరకూ ధరలు పెరగడంతో సామాన్యులు టపాసులను కొనేందుకు ఆసక్తి చూపలేదు. మరికొంత మంది తక్కువ మొత్తంలో కొనుగోలుతో సరిపెట్టుకున్నారు. చిన్నారుల కోసం 6 రకాల టపాసులు కొనాలన్నా కనీసం రూ.2 వేల వరకూ ఖర్చు చేయాల్సి వచ్చింది. మధ్య రకం స్పార్కిల్స్ (కాకరపూలు) గతేడాది రూ.60 నుంచి రూ.70 ఉండగా ఈ ఏడాది రూ.80 నుంచి రూ.90 పలికాయి. చిచ్చుబుడ్డి బాక్స్ గతేడాది రూ.150 ఉండగా రూ.200కు పెరిగింది. పెన్సిళ్లు గతేడాది రూ.120 ఉండగా రూ.170కు పెరిగాయి. తాళ్లు గతేడాది రూ.120 ఉండగా ఈఏడాది రూ.150కు పెరిగాయి. 1000 వాలా టపాసులు గతేడాది రూ.350 విక్రయించగా ఈఏడాది రూ.450కు విక్రయించారు. రూ.500 వెచ్చిస్తే కనీసం 3 రకాలు కూడా రావడం లేదు. అధిక ధరల వల్ల చాలా దుకాణాల్లో ఫ్యామిలీ ప్యాక్‌లు తెప్పించడమే మానేశారు. చిన్నారుల ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది తక్కువ మొత్తంలో టపాసులు కొనుగోలు చేసి సరిపెట్టుకున్నారు.

ఎండుతున్న పంటలు...

ఆరుగాలం కష్టపడే రైతు అతివృష్టి, అనావృష్టితో ప్రతి సంవత్సరం నష్టపోతూనే ఉన్నాడు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండిపోయి పెట్టుబడులు మట్టిపాలై అన్నదాతలు అప్పుల పాలయ్యారు. గ్రామాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు వలసలు వెళ్తున్నారు. కరువుతో పశువులకు మేత లేక పాడిపోషకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు మేత లేక అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో రైతులు వేసిన పంటలు వర్షాలు లేక 90 శాతం ఎండిపోయాయి.

ప్రజా రక్షణ భేరి జయప్రదానికి..

అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈనెల 15న విజయవాడలో సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ విజయవంతానికి జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కర్నూలులో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు నిర్వహించారు. నంద్యాలలో బైక్ ర్యాలీ చేపట్టారు.

అవీ..ఇవీ..అన్నీ...

మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు టపాసులు కాల్చి వేడుకలను జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అఖిలభారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టారు.

సామాజిక వర్గాలకు వైసిపి పెద్దపీట

- పత్తికొండ బహిరంగసభలో రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి-పత్తికొండ

ఎస్‌సి, ఎస్‌టి, బిసి , మైనార్టీ తదితర సామాజిక వర్గానికి పెద్దపీట వేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి, సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, మంత్రులు ఆదిమూలపు సురేష్, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్‌లు పేర్కొన్నారు. వైసిపి తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పత్తికొండకు చేరుకుంది. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధ్యక్షతన ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నుండి బస్సు యాత్ర ర్యాలీ ప్రారంభమై పట్టణ పురవీధుల గుండా భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం గుత్తి సర్కిల్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు అన్ని విధాలుగా పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అణగారిన వర్గాలకు చంద్రబాబు చేసింది ఏమీ లేదన్నారు. మరో ఐదు నెలలలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్ర భవితకు భవిష్యత్తుబాబు అంటూ మరో కొత్త నాటకానికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. సిఎం జగన్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళ లాంటివని పేర్కొంటూ ముందుకు వెళుతున్నారని తెలిపారు. 2024 ఎన్నికలలో రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రదర్శన ముందు భాగాన చెక్కభజన, గొరవయ్యలు, గిరిజన లంబాడీల నృత్య ప్రదర్శన పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బివై. రామయ్య, ఎంపి సంజీవ్ కుమార్, మాజీ ఎంపి బుట్టా రేణుక, ఎమ్మెల్సీలు మధుసూదన్, రమేష్ యాదవ్, పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, ఎంపిపి నారాయణదాసు, వైసిపి జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ, వేదికపై అంజాద్‌బాష, సురేష్

దళిత మహిళా సర్పంచికి అవమానం..

వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రారంభించారు. పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఎస్‌సి సర్పంచి కొమ్ముదీపికకు ఆహ్వానించలేదు. ఆమె తీవ్ర నిరాశకు గురయ్యారు. స్టేజ్ పై సర్పంచి కనపడకపోవడంతో సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చిన ప్రజలు అవాక్కయ్యారు. ఇదెక్కడి న్యాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. మేజర్ గ్రామపంచాయతీ దళిత మహిళ సర్పంచి కొమ్ము దీపిక ఎక్కడ సామాజిక న్యాయం జరిగిందని దళిత సంఘల ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెడికల్ అలవెన్స్ బిల్స్ వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన మెడికల్ అలవెన్స్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ఆల్ ఇండియా డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నెలసరి సమావేశం రీజనల్ నాయకులు శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పి.మద్దిలేటి, సర్కిల్ అధ్యక్షులు ఎం.యాకోబ్ మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు యూనియన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు అందులో ప్రధానంగా మెడికల్ అలవెన్స్ బిల్స్ ఫ్యామిలీ పెన్షన్స్ , పిఆర్‌సి పే రివిజన్ లాంటి సమస్యలను గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో సర్కిల్ సహాయ కార్యదర్శి జి.మహేశ్వరరావు, సర్కిల్ నిర్వహణ కార్యదర్శి ఎం. రంగయ్య, ఉపాధ్యక్షులు ఎ. రామలింగం లు ప్రసంగించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ఏవి ఉన్నా యూనియన్ దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా దీవెనకు జాయింట్ అకౌంట్ సరికాదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జగనన్న విద్యా దీవెనకు జాయింట్ అకౌంట్ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు కె.కె. భవన్లో ఎస్ఎఫ్ఐ కర్నూల్ నగర కమిటీ సమావేశం నగర అధ్యక్షులు అమర్ అధ్యక్షతన నిర్వహించారు. సాయి ఉదయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించే విద్యా దీవెన, వసతి దీవెన నిబంధనలో తల్లిదండ్రులకు విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉందని అన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో నిబంధనలు పెట్టడం సరైనది కాదన్నారు. తల్లిదండ్రులు ఒకచోట విద్యార్థులు మరొకచోట ఉండటం వలన ప్రస్తుత తరుణంలో జాయింట్ అకౌంట్ చేయడం సమస్యగా మారు తుందన్నారు. ఇంటర్నల్ ఎగ్జామ్స్ ఉన్నందున జాయింట్ అకౌంట్ చేయడానికి సొంత ఊర్లకు విద్యార్థులు రాలేరన్నారు. లక్షలాది మంది విద్యార్థులు అతి తక్కువ సమయంలో బ్యాంకు ఖాతాలు తీసుకోవడం కూడా కష్టమన్నారు. ఈనెల 28న జగనన్న విద్యాదీవెన నిబంధన విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఖాతా నిబంధనలు చాలా నష్టదాయకమని అన్నారు. జాయింట్ అకౌంట్‌కు చెందిన సమాచారం ఎక్కువమంది విద్యార్థులకు తెలియదన్నారు. మళ్లీ సచివాలయాల్లో అప్లోడ్ చేయాలని కూడా చెప్పడం ఇబ్బంది కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ అకౌంట్ నిబంధనలను రద్దు చేయాలని, లేకపోతే విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నగర నాయకులు అబు బకర్ , మల్లేష్ , భాస్కర్ , ఆర్యన్ , రాజు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల పెండింగు జీతాలివ్వాలి

మోసం చేస్తున్న ఎక్స్‌పర్ట్ ఏజెన్సీని రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ , హాస్టల్ లలో ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ ద్వారా భద్రత కోసం పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు, సూపర్వైజర్లకు 4 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు ఓల్డ్ సిటీ కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఉపాధ్యక్షులు మైమూద్ అధ్యక్షతన మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ అండ్ హాస్టల్, కర్నూలు ప్రభుత్వ కంటి హాస్పటల్, కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ అండ్ హాస్టళ్లలో భద్రత కోసం టెండర్ తగ్గించుకున్న ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ వారు మొదటనే నిరుద్యోగులకు పర్మినెంటు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసి ఒక్కో కార్మికుడు దగ్గర రూ.లక్ష నుండి లక్షన్నర డబ్బులు వసూలు చేసుకున్నారని గుర్తు చేశారు. అగ్రిమెంటులో ఉన్న ప్రకారం జీతం ఇవ్వకుండా తక్కువ జీతాలు ఇస్తూ కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. ఎవరైనా హక్కులు జీతం అడిగినా సూపర్వైజర్ల ద్వారా వారిని టార్గెట్ చేస్తూ లేని ఆరోపణలు చేసి ఉద్యోగం నుండి తొలగిస్తున్నారని తెలిపారు, మహిళా సెక్యూరిటీ గార్డులను లైంగికంగా వేధిస్తున్న సూపర్వైజర్లకు ప్రమోషన్లతో ప్రోత్సాహకాలు ఇస్తున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీలో పనిచేసే సెక్యూరిటీ గార్డ్స్‌కు 4 నెలల నుండి జీతాలు, దసరా దీపావళి లాంటి పండుగలకు కూడా జీతాలు ఇవ్వకుండా పస్తులు పెట్టారని తెలిపారు. నాలుగు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా ఏజెన్సీ వారు ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఇప్పటికైనా విషయాన్ని అర్థం చేసుకొని కార్మికులను మోసం చేస్తున్న ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు డి. కుమార్, ఆటో యూనియన్ నాయకులు బడేబాష, నాగరాజు, నబిసా పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయరామాంజనేయులు, మహిమూద్ తదితరులు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్‌ఖాన్

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అభివృద్ధిపనులపై శనివారం 14, 16 ,17,18 వార్డులలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు నగరంలో నాడు నేడు ద్వారా ఎన్నో పనులు పూర్తి చేశామన్నారు. హాస్పిటల్స్,పార్క్స్, పాఠశాలలు, రోడ్స్, బ్రిడ్జెస్, అర్బన్ హెల్త్ సెంటర్స్, రూపు రేఖలు మార్చామన్నారు. కరోనా కష్టకాలంలో కర్నూలు నగర ప్రజలకు ఆక్సిజన్స్ కాన్సన్ట్రేటర్స్, ఆక్సిజన్ ప్లాంట్స్, ఫ్రీ అంబులెన్సు,సేవలు అందించామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు కైపా పద్మలత రెడ్డి, కోఆప్షన్ మెంబర్లు రాములు, నయీమ్ పాషా, కార్పొరేటర్ పల్లవి, క్లస్టర్ 2 ప్రెసిడెంట్ కేదార్ నాథ్, వార్డు ఇన్‌చార్జులు వెంకటరామిరెడ్డి, మంజులత, మల్లికార్జున, పర్ల సూర్యుడు, పవన్ కుమార్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా 'విజయవంతం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి .సృజన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ రమణను ఆదేశించారు. శనివారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాకు చేరుకున్న ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కిట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎన్ని స్పోర్ట్స్ కిట్లు వచ్చాయని, ఒక కిట్ లో ఉండవలసిన ఐటమ్స్ అన్ని ఉన్నాయా చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించుకోవాలని సిఇఒ ను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు క్రికెట్, కబడి, ఖో ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటలలో క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను ప్రదర్శించుకొనుటకు మంచి అవకాశాలు కల్పిస్తోందన్నారు. జిల్లా లో డిసెంబర్ 15 నుండి 2024 జనవరి 21 వరకు గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో నిర్వహించే అడుదాం - ఆంధ్రా క్రీడల పోటీలను ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా అధికారులు , స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని విజయవంతంగా జరిగేలా చూడాలని స్పోర్ట్స్ అథారిటీ సిఇఒను కలెక్టర్ ఆదేశించారు.

20న కలెక్టరేట్లో స్పందన

ఈనెల 20న సోమవారం లెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మైపర్‌లో డయాబెటిస్ అవగాహన లో వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు

మైపర్‌లో డయాబెటిస్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఎ క్యాంప్‌లోని మైపర్ కళాశాలలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మైపర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా డయాబెటిస్ అవేర్నెస్ క్యాంప్ నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ సి.గోపీనాథ్‌రెడ్డి మైపర్ విద్యార్థులకు డయాబెటిస్ దానికి తీసుకోవాల్సిన ప్రివెంటివ్ మెజర్స్‌ను వివరించారు. డయాబెటిక్ బారిన పడినవారు ఏ విధంగా లైఫ్ స్టైల్ ని తీర్చిదిద్దుకోవాలో విద్యార్థులకు తెలిపారు. మైపర్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ పిఒ కాసర్ల సురేష్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'డాక్టర్ కెవిసుబ్బారెడ్డి' లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ కెవిసుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. చెన్నయ్‌కు చెందిన టివిఎస్ సుందరం పార్ట్‌నర్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ హెచ్ఆర్ సిహెచ్.సురేష్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 96 మంది విద్యార్థులు పాల్గొనగా 53 మంది ఎంపికయ్యారు. మరొక కంపెనీ రాష్ట్ర టెక్ సోర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన డైరెక్టర్ సుధీర్, కో డైరెక్టర్ కె.సతీష్ పాల్గొన్నారు. విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్ , రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. కరస్పాండెంట్ ఎస్. విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ ఉద్యోగం సాధించిన విద్యార్థులు కెవిసుబ్బారెడ్డి కళాశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చినందుకు అభినందించారు. ఉద్యోగం రాని వాళ్ళు కుంగిపోకుండా మరోసారి ప్రయత్నం చేస్తే విజయం సాధించవచ్చని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విజయకుమార్, ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ కె.కన్న కుమార్, హెచ్ఒడిలు, అధ్యాపకులు ఉద్యోగాలకు ఎంపికయిన విద్యార్థులను అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

జెండాను ఆవిష్కరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని వైసిపి రాష్ట్ర యువనేత వై.ప్రదీప్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని సూగూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందడంతో లబ్ధిదారులు సంతృప్తిగా ఉన్నప్పటికీ తాగునీటి సమస్య ఉన్నట్లు చెబుతున్నారని తెలిపారు. పక్కనే ఎస్ఎస్ ట్యాంకు ఉన్నా ఈ దుస్థితి ఏమిటని ప్రశ్నించారు. పైపులైన్ల విస్తరణలో సమస్యలు వస్తున్నాయని తెలపడంతో పరిష్కారం చూపాలని కోరారు. రోడ్డు సమస్య కూడా ఉందని, రానున్న రోజుల్లో వేయిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వాలంటీరు వ్యవస్థ బాగా పని చేసిందని ప్రశంసించారు. 'గడపగడపకు' వచ్చిన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో గ్రామం నుంచి ఎప్పుడూ మెజారిటీ వస్తుందని, దానిని మరచిపోమని, అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బుక్ లెట్ ను అందజేశారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఆయనకు వైసిపి నాయకులు శాలువా, గజమాలతో సన్మానించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి శంకరమ్మ, ఎంపిటిసి హనుమంతు, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ మణిమంజరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేదస్వరూప, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, ఎపిఒ తిమ్మారెడ్డి, పిఆర్ ఎఇ నరసింహులు, ఎఒ గణేష్, నాయకులు లక్ష్మయ్య, లక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.

వలస వెళ్లి ఇబ్బందులు పడొద్దు : ఎంపిడిఒ

ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లోనే ఉపాధి పనులు జరుగుతున్నాయని, వలస వెళ్లి ఇబ్బందులు పడొద్దని ఎంపిడిఒ మణిమంజరి కోరారు. అమ్మాయిలకు బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని తెలిపారు.

జాతీయస్థాయిలో విద్యార్థి ప్రతిభ

- భువిన్‌కు మోనె శ్రీరాములు, పాఠశాల ప్రిన్సిపల్ మోహన్ అభినందన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన హ్యాక్థన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాంపిటీషన్‌లో డేటా అనలిటిక్స్ ఉపయోగించి నేల లక్షణాలను నిర్ణయించడంలో ఎమ్మిగనూరు పట్టణ వాసి బి.భువిన్ విజేతగా నిలిచారు. శనివారం పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీ గల విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని వోగ్జిన్ యూనివర్సిటీలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భువిన్ అనే విద్యార్థిని సోషల్ సర్వీస్ వర్కర్ మోనె శ్రీరాములు, పాఠశాల ప్రిన్సిపల్ మోహన్‌లు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని వందకు పైగా యూనివర్సిటీల నుంచి జాతీయస్థాయిలో అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. హ్యాక్థన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాంపిటీషన్‌లో ఎమ్మిగనూరుకు చెందిన విద్యార్థి విజేతగా నిలవడం విశేషమన్నారు. భవిష్యత్తులో మరిన్నీ విజయాలు అందించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ ఉషా పరిమళ, రేఖ, ఫమీన సతీష్, ముజీబ్, రఫిక్, కేశవ, తిమ్మప్ప, మెహబూబ్, రాము పాల్గొన్నారు.

స్వీపర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లుగా 15 ఏళ్ల నుంచి పని చేస్తున్నా కేవలం రూ.4 వేలు చెల్లిస్తూ వెట్టిచారికి చేయించుకుంటున్నారని విమర్శించారు. అది కూడా నాలుగు నెలలకోసారి ఇవ్వడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందరికీ ఆర్డర్ ఫారాలు ఇవ్వాలని, ప్రతి నెలా 1న జీతాలు నేరుగా అకౌంట్లలో వేయాలని కోరారు. జిఒ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వైపి.ఈరమ్మ, కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా ఎం.రాజేశ్వరిని ఎన్నుకున్నారు.

కరువుపై మొద్దు నిద్ర వీడాలి

- **గ్రామాలు ఖాళీ అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం**
- **కరువు సహాయక చర్యలు చేపట్టడంలో విఫలం**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి**

ప్రజాశక్తి - ఆదోని

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు చేతకందక రైతులు తీవ్ర కరువులో కూరుకుపోయారని, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మండిపడ్డారు. శనివారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో 350 మండలాలకు గాను 103 మండలాల్లో తీవ్ర కరువు ఏర్పడిందని తెలిపారు. సాగు చేసిన పంటలు చేతికందక పెట్టిన పెట్టుబడి తిరిగి రాక రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని చెప్పారు. ఉన్న ఊళ్లో పనులు దొరకక పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు వలస పోతున్నా కరువు లేదని ప్రభుత్వం పేర్కొనడం సిగ్గుచేటన్నారు. కరువు తాండవిస్తున్నా సహాయక చర్యలపై ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రణాళిక లేకపోవడం దారుణమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కేంద్రానికి ఎలాంటి నివేదిక, కనీసం లేఖ కూడా రాయని దుస్థితిలో ఉందని విమర్శించారు. కడప జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. కరువును ఏ కొలబద్ధన నిర్ధారించారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. జిల్లాలోని తుగ్గలి మండలంలో తీవ్రమైన కరువు పరిస్థితి ఉన్నా కరువు ప్రాంతంగా ప్రకటించకుండా విస్మరించారని మండిపడ్డారు. పంటలు సాగు చేసినప్పటికీ నెలలు తరబడి వర్షం కురవలేదని, ఏ ప్రాతిపదికన కరువు లేదని తేల్చారో తెలపాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 30 నాటికి ఖరీఫ్ సీజన్ ముగిసిందన్నారు. రబీ ప్రారంభమైనా ఎక్కడా పంటలు సాగు చేస్తున్న పరిస్థితి లేదన్నారు. ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో పనులు కల్పించకపోవడం వల్ల లక్షలాది మంది సుదూర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. గ్రామాల్లో కరువు దృష్ట్యా సహాయక చర్యలు చేపట్టడంలో ఇప్పటికీ సరైన ప్రణాళిక లేదన్నారు. ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని కోరారు. రైతు కుటుంబాలకు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికీ రూ.10,000 కరువు సాయం ప్రకటించాలని కోరారు. మనిషికి 10 కిలోలు కాకుండా 20 కిలోలు బియ్యం బతకడానికి ఇవ్వాలని తెలిపారు. కరువు పరిస్థితులపై ఇప్పటికే ప్రభుత్వానికి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చామని వివరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్, తిప్పన్న, నాగరాజు, ముక్కన్న, వెంకటేష్, నాగేంద్ర, మునెప్ప ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- డిసిసి అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు బాబురావు, ప్రధాన కార్యదర్శి మహేంద్ర నాయుడు తెలిపారు. శనివారం మండలంలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఆ గ్రామ పెద్ద ఆర్ఎంపి వెంకట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంక్షేమ పథకాల పేరుతో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లను మూసివేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని, రాష్ట్రంలో కూడా భవిష్యత్తులో పుంజుకుంటుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ సహాయ కార్యదర్శి లాజరస్, మహిళ అధ్యక్షులు ప్రమీల, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సుజాత, కార్యదర్శి రియాజ్, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి సుంకన్న, నగర అధ్యక్షులు గోవిందు, చిప్పగిరి కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు మిరపకాయల శ్రీనివాసులు, హోటల్ కాసీం, కోడిగుడ్ల దస్తగిరి పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టిడిపి నాయకులు ఆరోపణలు మానుకోవాలని వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మాజీ కౌన్సిలర్ నాగేంద్ర తెలిపారు. శనివారం ఆదోనిలోని వైసిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమ కేసులంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు 2014 నుంచి 2019 వరకు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి ప్రజాధనాన్ని దోపిడీ చేసి స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుపాలయ్యారని తెలిపారు. దేశం కోసం పోరాటం చేసి చంద్రబాబు జైలుకు పోలేదని చెప్పారు. రెండెకరాలు ఉన్న చంద్రబాబు రూ.లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యారో ప్రజలందరికీ తెలుసన్నారు. జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టాలనుకుంటే ప్రభుత్వం వచ్చిన వెంటనే చేసే వారన్నారు. 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజల ఆశీస్సులతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాందాస్, తాయన్న పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టండి

- కాంగ్రెస్ కోఆర్డినేషన్ మెంబర్ దిలీప్ ధోకా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గ సమస్యలపై అటు అధికారులు, ఇటు పాలకులు దృష్టి పెట్టాలని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ మెంబర్ దిలీప్ ధోకా తెలిపారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప అధ్యక్షత వహించారు. నియోజకవర్గ సమస్యలపై, మండలాల్లో కరువు స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పేదలకు ఇల్లు పంపిణీ, పట్టణంలోని లబ్ధిదారులకు పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయని తెలిపారు. గతంలో ఇంటి పట్టా కోసం రూ.2100 డిడిలు చెల్లించినా ఇంతవరకు ఇంటి పట్టా మంజూరు కాలేదని చెప్పారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పట్టణ కార్యదర్శి సాయినాథ్, యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఐఎన్‌టియుసి నాయకులు జయరాం, మద్దిలేటి, మాణిక్యరాజు, నిస్సార్ అహ్మద్, రామాంజి, నాగేష్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

యస్.ఓ.పి.నెం.19/2023

1.శ్రీమతి కె.లక్ష్మిదేవి భర్త లేటు శ్రీనివాసులు, వయస్సు 50 సంవత్సరాలు.
2.కె.విజయ్ కుమార్ తండ్రి లేటు శ్రీనివాసులు, వయస్సు 29 సంవత్సరాలు.
3.కె.వంశీకృష్ణ తండ్రి లేటు శ్రీనివాసులు, వయస్సు 24 సంవత్సరాలు.
నివాసం.ఇంటి.నెం.45/185-44బి1, నరసింహారెడ్డినగర్,కల్లూరు మండలం,కర్నూలు సిటి.
...అర్జీదారులు

(ఎదురి)

లేరు ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, నరసింహారెడ్డినగర్, గ్రామ ప్రజలకు తెలియజేయమేమనగా పై నెంబరు యస్.ఓ.పి.లో అర్జీదారుల యొక్క తండ్రి కె.శ్రీనివాసులు 07-06-2021 వ తేదిన చనిపోయినాడని అతనికి పై కనబరచిన అర్జీదారులు వారసులమని వారసు సర్టిఫికేటు ఇప్పించమని కోరుతూ మరియు 1 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ.యస్.నెం. 362/2022 లో రావలసిన దావా మొత్తము తీసుకొనుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ అర్జీదారులు అర్జీదాఖలు చేసినారు. ఇందులో ఎవరికైనా ఏమైన అక్షేపణలు వున్న యెడల 11-12-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

కె.ఉమాహనుమంతరావు
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలో రోడ్లు ఎలా ఉన్నాయో వైసిపి నేతలకు కనిపించడం లేదా అని, జగన్ మాటలు చెప్పడం తప్ప అభివృద్ధి చేయలేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. శనివారం మండలంలోని నాగనాథనహళ్లి, హోళగుంద రహదారి మధ్య గుంతలు ఉన్న రోడ్డుపై టిడిపి, జనసేన కార్యకర్తలు నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి 'నాలుగేళ్లలో గుంత కూడా పూడ్చలేని వైసిపి ప్రభుత్వం.. సిగ్గు, సిగ్గు' అంటూ నినాదాలు చేశారు. రోడ్డుపై పడిన గుంతలను చూపిస్తూ వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. టిడిపి నాయకులు రంగన్న, రామస్వామి, తిమ్మప్ప, రంగస్వామి నాయుడు, మైనార్టీ నాయకులు అప్సర్ బాష, మండల నాయకులు బసవరాజు, బసాపురం వెంకటేష్ చౌదరి, జనసేన నాయకులు రమేష్ యాదవ్, రాజశేఖర్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని దళిత కాలనీలో ఎంబి చర్చి సమీపంలో పూర్తిగా పాడైపోయిన రోడ్లను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖ గౌడ్ పరిశీలించారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. రోడ్డుపై పడిన గుంతలను చూపిస్తూ వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరి నిరసన చేపట్టారు. **మంత్రాలయం** మండలంలోని సూగూరు, బూదూరు గ్రామాలకు వెళ్లే రోడ్లపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, విజయరామిరెడ్డి, తిక్కస్వామి, నాగరాజు, రాగన్న, రవి, సుజ్ఞానం, ఇజ్రాయేల్, జనసేన నాయకులు ఏసోబు, ప్రవీణ్, బిబిసి.చిన్న, బి.రవిచంద్ర పాల్గొన్నారు. **దేవనకొండ**లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రోడ్ల దుస్థితిపై నిరసన చేపట్టారు. టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, మాలిక్, వీరేష్, మల్లయ్య, డీలర్ బండ్లయ్య, మాల బండ్లయ్య, మస్తాన్, తెలుగు యువత నాయకులు రాజా సాహెబ్, ఖాసీం, రాజశేఖర్ గౌడ్, చాంద్‌బాష, జనసేన నాయకులు మక్బుల్, మహానంది, ఆంథోని, రామలక్ష్మణ్, వీరేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ఎమ్మిగనూరు నిరసన తెలియజేస్తున్న నాయకులు

మంత్రాలయంలో నిరసన చేపడుతున్న నాయకులు

దేవనకొండలో రోడ్ల దుస్థితిని చూపిస్తున్న నాయకులు

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

యస్.ఓ.పి.నెం.13/2023

1.యం.శ్యామ్ సుందర్
2.గౌడమ్‌పల్లి. చంద్రకళ ... అర్జీదారులు

(ఎదురి)

లేరు ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలుజిల్లా, కర్నూలు గ్రామము, లింగం రవివీధి ప్రజలకు తెలియజేయమేమనగా పై నెంబరు యస్.ఓ.పి.లో మద్దాలి.వెంకటశేషగిరిరావు, తండ్రి సత్యనారాయణ 2.మద్దాలి.లీలావతమ్మ భర్త యం.వెంకటశేషగిరిరావు, ఇంటి.నెం.2-330ఎ1,లింగం రవివీధి,దుర్గాగేటు దగ్గర, కర్నూలు. 27-10-2022 వ తేది యం.వెంకటశేషగిరిరావు,09-05-2022 వతేదిన యం.లీలావతమ్మ చనిపోయినారని, వీరకి పై కనపరచిన అర్జీదారులు వారసులమని వారసత్వ సర్టిఫికేటు ఇప్పించమని, మరియు సహరా క్రెడిట్ కో-ఆపరేటివ్ సోసైటి లిమిటెట్, లక్నోలో ఉండే మొత్తం రూ.5,51,238/-లు తీసుకొనుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినారు. ఇందులో ఎవరికైనా ఏమైన అక్షేపణలు వున్న యెడల 14-12-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

బి.క్రిష్ణమూర్తి
యస్.టిప్పుసుల్తాన్,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

ఆంజనేయ స్వామికి ఉత్సవ విగ్రహ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

మండలం లోని ఈకల బెట్ట గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహ నిర్మాణానికి విరాళం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి, వైసిపి యువనేత ప్రదీప్‌రెడ్డి తరఫున వైసిపి నేత ముకి రెడ్డి ఆలయ పెద్దలకు రూ.లక్ష నగదును అందజేశారు. మాజీ సర్పంచి మూలింటి ఈరన్న, ఈరన్న, హనుమంతు, నాగరాజు పాల్గొన్నారు.

ఆలూరు ఎస్ఐగా ఓబులేసు

ప్రజాశక్తి-ఆలూరు



నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ హెచ్.ఓబులేసును ఆలూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ డిఐజి సెంథిల్ కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆలూరులో ఎస్ఐగా నరసింహులు, తలారి శ్రీనివాసులు, రామానుజులు, డాక్టర్ నాయక్ విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఎస్ఐ డాక్టర్ నాయక్ బదిలీ అయిన మూడు నెలలకు నూతన ఎస్ఐగా హెచ్.ఓబులేసును నియమించడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజులైనా చార్జి తీసుకోకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి- పెద్దకడబూరు

నష్టపరిహారం జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించాలని ఎఒ ఎం.వరప్రసాద్ తెలిపారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతుల జాబితా తయారు చేసేందుకు పెద్దకడబూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతు భరోసా కేంద్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ వరప్రసాద్, మంత్రాలయం ఉద్యాన శాఖాధికారి హరీంద్ర మాట్లాడారు. ఆర్‌బికె సిబ్బంది, విఆర్‌ఒలు పంటలు నష్టపోయిన వారి జాబితా తయారు చేస్తారని తెలిపారు. ఆ జాబితాను సామాజిక తనిఖీ కోసం ఈనెల 21 నుంచి 25 వరకు ఆర్‌బికెల వద్ద ప్రదర్శిస్తామని చెప్పారు.

అధికారాన్ని వైసిపికి తాకట్టు పెట్టిన కమిషనర్

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తన అధికారాన్ని వైసిపికి తాకట్టు పెట్టారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి విమర్శించారు. శనివారం బీవీ తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి గెలుపొందిన నాటి నుంచి ఎమ్మిగనూరులో భూవివాదాలు పెరిగిపోయాయని తెలిపారు. ప్రజల ఆస్తులను కాపాడడంలో టిడిపి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రజలను పీడించి చెత్త పన్ను వసూలు చేయించడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేయడంలో లేదని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వైసిపి కండువా కప్పుకొని కౌన్సిలర్‌గా పోటీ చేస్తే బాగుంటుందని హితవు పలికారు. గతంలో ఎమ్మెల్యేగా చెన్నకేశవ రెడ్డి ఉన్నారని, ఎన్నడూ లేని భూవివాదాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. గతంలో మాచాని సోమప్ప కులమతాలకు అతీతంగా సుమారు 6.06 ఎకరాల్లో వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్ కేటాయిస్తే ఆ స్థలంలో షెడ్లు ఏర్పాటు చేయడం సిగ్గు చేటని తెలిపారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్ర అత్యున్నత నాయస్థానం కూడా తమ న్యాయమైన అభ్యర్థనను విని 3 నెలల్లో వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించాలని పేర్కొందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డిని దీనిపై వివరణ కోరి షెడ్లను తొలగించాలని అడిగితే జాప్యం చేసి, మిలిటరీ కాలనీలో సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థిర గృహాలను రోడ్ వైడెనింగ్ పేరుతో జెసిబిలతో కూల్చడానికి వెళ్లారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి పేదలంటే, పేదల ఆస్తులంటే అంత చులకన, కోపం ఎందుకని నిలదీశారు. దయాసాగర్, కలీముల్లా, కొండయ్య చౌదరి, రంగస్వామి గౌడ్, మధుబాబు, మల్లికార్జున, కటారి రాజేంద్ర, బనవాసి అబ్రహాం, గురు రాజ్ దేశాయి, ఖాసీం వలీ, కృష్ణమ నాయుడు, బేతాళ బడే సాబ్, రామాంజనేయులు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

పేదలను ఆదుకోవడంలో సంతృప్తి

- జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎంత ఎదిగినా ఉన్న దాంట్లో నిరుపేద కుటుంబాలకు కొంతవరకైనా ఆర్థిక చేయూత అందిస్తే సంతృప్తి కలుగుతుందని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. శనివారం చిప్పగిరిలో అనారోగ్యంతో చనిపోయిన గురునారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటి యజమాని చనిపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఛిన్నాభిన్నమైందని తెలుసుకొని కుటుంబ పెద్దలకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందించారు. భవిష్యత్తులో ఏ రకమైన సహాయం కావాలన్నా ముందుంటానని భరోసా కల్పించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

- విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - దేవనకొండ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దేవనకొండలోని ఎఫ్ఆర్ హైస్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల్లో ఘనంగా జరిగాయి. శనివారం పాఠశాలలోని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ పి.రఘునాథ మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని తెలిపారు. మంచి పుస్తకాలు ఎక్కడ దొరికినా వాటిని కొనుగోలు చేసి ఇళ్లల్లో జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. పుస్తకాలను ఎంత ఎక్కువగా చదివితే అంత తెలివితేటలు పెరుగుతాయని తెలిపారు. గ్రంథాలయ అధికారి వెంకటరమణ, ఉపాధ్యాయులు వీర ప్రకాష్, రంగస్వామి, పాండురంగడు, గోపాల్, పి.శ్రావణి, స్రవంతి, లక్ష్మి పాల్గొన్నారు. **ఆదోని** ఆర్ట్స్ కళాశాలలో పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపల్ మురళీ మోహన్, వైస్ ప్రిన్సిపల్ సురేష్ ప్రారంభించారు. విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. లైబ్రేరియన్ వేణుగోపాల్, అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 15న మండల శాఖ లైబ్రేరియన్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో డ్రాయింగ్, పదాల అంత్యాక్షరి, కథలు చెప్పడం, మ్యూజికల్ చైర్స్, పద్యాలు చెప్పడం తదితర ఆటల పోటీలు నిర్వహించారు. సర్పంచి మల్లమ్మ, ఉప సర్పంచి హుస్సేన్, నాయకులు ఆంజనేయులు పాల్గొని బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టోరియమ్మ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు నాగరాజ్, సుజాత, శివకుమార్ పాల్గొన్నారు.

బాధితునికి నగదు అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బాధితుడు పోగొట్టుకున్న డబ్బు ఎల్ఐసి ఏజెంట్ మల్లేష్‌కు దొరకగా బాధితునికి అందజేశారు. ఎల్ఐసి ఏజెంట్ మల్లేష్ ఆదోని ఐసిఐసిఐ బ్యాంకుకు పని నిమిత్తం వెళ్లారు. బస్సులో సీటులో కూర్చొని ఉండగా పెద్ద నల్ల ఓవర్ గేటు మూలన కనబడింది. దానిని తీసుకొని చూడగా రూ.68,200 డబ్బు ఉంది. కవర్‌లో ఉన్న పేపర్‌లో ఫోన్ నెంబర్ రాసి ఉంది. మానవత దృక్పథంతో ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా మాధవరానికి చెందిన చికెన్ షాపు సమీర్‌గా తెలిసింది. పూర్తి వివరాలు తెలుసుకొని ఆ డబ్బు సమీర్‌కు అందజేశారు. సమీర్ సంతోషం వ్యక్తం చేస్తూ ఎల్ఐసి ఏజెంట్ మల్లేష్‌కు శనివారం కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా తెలిపారు. శనివారం హోళగుందలో ఆయన మాట్లాడారు. త్వరలో ఆయా రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు హెచ్.పరసప్ప, పీరాసాబ్, మైనారిటీ నాయకులు ఖాజప్ప, సాయి బాబా, వీరన్న, బోయ సీతప్ప, హరిజన నరసప్ప, బోయ రామారావు, ఎహసాన్, వందవాగిలి మాబు, సయ్యద్ ఫైజాన్, అబుబాకర్, ఖలీద్, ఖలీల్, ఫరూక్, కురువ ఈరన్న, జావీద్, రాజా సాబ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమానుల్లా

'అర్హులందరికీ పథకాలు అందాలి'

ప్రజాశక్తి - నందవరం

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలని, ప్రతి అధికారి కలిసికట్టుగా పని చేయాలని ఎంపిడిఒ దశరథ రామయ్య తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ సోక్ ఫిట్స్, ఆడుదాం ఆంధ్ర, కుల గణన సర్వే, బాల్య వివాహాల నివారణ, పంచాయతీ అభివృద్ధి, జగనన్న విద్యా దీవెన, పింఛన్లపై సమీక్ష నిర్వహించారు. ప్రతి అధికారీ ఒకరికొకరు సహాయం, సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

యస్.ఓ.పి.నెం.14/2023

1.కాసా.రేణుకాదేవి భర్త కాసా.సూర్యప్రకాష్,
2.కాసా.జగత్ విఖ్యాత్ సాయి.
3.కాసా.రిత్విక్ విఖ్యాత సాయి ...అర్జీదారులు

-Vs-

యం/యస్.ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్.లిమిటెడ్.
రెప్రజెంటెడ్ బై అసిస్టెంట్ మేనేజర్ ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము, గణేష్‌నగర్ కాలనీ ప్రజలకు తెలియజేయమేమనగా పై నెంబరు యస్.ఓ.పి.లో కాసా.సూర్యప్రకాష్ చనిపోయినాడని, అతనికి పై కనపరచిన అర్జీదారులు వారసులమని వారసత్వ సర్టిఫికేటు ఇప్పించమని, మరియు కర్నూలు ముత్తూట్ క్యాపిటల్ సర్వీసెస్.లిమిటెడ్.కర్నూలు బ్రాంచ్ నందు పనిచేస్తూ చనిపోయినాడని అతనికి కంపెనీ నుండి రావలసిన గ్రాట్యూటీ మొత్తం రూ.32,149/-లు తీసుకొనుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినారు. ఇందులో ఎవరికైనా ఏమైన అక్షేపణలు వున్న యెడల 27-12-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

శ్రీమతి ఎ.అన్నపూర్ణారెడ్డి,
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE IIND ADDITIONAL DISTRICT COURT KURNOOL AT ADONI
O.S. No. 3 OF 2019

BETWEEN
G.T. VENKATESULU SETTY ..... PLAINTIFF
G. GOVINDA RAJULU AND OTHERS ...... DEFENDANTS

TO
53 G SUNITHA,
W/O LATE G. NAGARAJ SETTY,
R/O. H.No. 1-1916-1, GANDHI NAGAR,
YEMMIGANUR D : KURNOOL.
59 V. ARUNA,
D/O. LATE G K VISWANATH SETTY,
R/O H.No. 5/380, Near Agricultural Market Comittee Yemmiganur, D : Kurnool
60 N.SUJATHA, D/o. LATE G.K.VISWANATH SETTY, RIO H.NO. 5/360, Near Agricultural Market Comittee Yemmiganur, D: Kurnool.
61 D. VINEETHA,
D/O. G.K. VISWANATH SETTY,
R/O H.No. 5/380, Near Agricultural Market Comittee Yemmiganur, D : Kurnool
62. R. PRAMEELA,
D/O. LATE G.K.VISWANATH SETTY,
R/O. H.NO. 5/380, Near Agricultural Market Comittee Yemmiganur, D : Kurnool
63. G.VARALAKSHIMI
W/O, G.GOPAL SETTY, R/O. 5/379,
H.B.S.COLONY, YEMMIGANUR,
D:KURNOOL
67 K. NAGESH
S/O URUKUNDAPPA, R/O. D.NO. 3/75,
SINDANUR VILLAGE, IEEZA MANDALAM
D. GADWAL TELAGANA.

Whereas the plaintiff has instituted a suit against you for the plaintiff mentioned relief vide plaint copy attache herewith, you are hereby summoned to appear in the court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall accompanied by some other person able to answer all such questions on the 6TH day of DECEMBER 2023 at 10.30 'o' clock in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence.

Take notice that, in defaults of your appearance on the day before mentioned heard and determined in your absence.

SMT G.M. LALITHA
ADVOCATE, Adoni

మండిన ధరలు..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

దీపావళి అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది కాకరపూల వెలుగులు, టపాసులు ఢాం.. ఢాం శబ్దాలు... అవి లేకుండా దీపావళి పండుగ జరుగదు. దీపావళికి కొనుగోలు చేసే టపాసులు ధరలు ఈ ఏడాది మండిపోయాయి. గతేడాది కంటే 20 నుంచి 25 శాతం వరకూ ధరలు పెరగడంతో సామాన్యులు టపాసులను కొనేందుకు ఆసక్తి చూపలేదు. మరికొంత మంది తక్కువ మొత్తంలో కొనుగోలుతో సరిపెట్టుకున్నారు. చిన్నారుల కోసం 6 రకాల టపాసులు కొనాలన్నా కనీసం రూ. 2 వేల వరకూ ఖర్చు చేయాల్సి వచ్చింది. మధ్య రకం స్పార్కిల్స్(కాకరపూలు) గతేడాది రూ.60 నుంచి రూ.70 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 ఉన్నాయి. చిచ్చుబుడ్డి బాక్స్ గతేడాది రూ.150 ఉండగా రూ. 200కు పెరిగింది. పెన్సిళ్లు గతేడాది రూ.120 ఉండగా రూ.170కు పెరిగాయి. తాళ్లు గతేడాది రూ.120 ఉండగా ఈ ఏడాది రూ.150కు పెరిగాయి. 1000 వాలా టపాసులు గతేడాది రూ.350 విక్రయించగా ఈ ఏడాది రూ.450కు విక్రయించారు. రూ.500 వెచ్చిస్తే కనీసం 3 రకాల టపాసులు కూడా రాలేదు. అధిక ధరల వల్ల చాలా దుకాణాల్లో ఫ్యామిలీ ప్యాక్‌లు తెప్పించడమే మానేశారు. చిన్నారుల ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది తక్కువ మొత్తంలో టపాసులు కొనుగోలు చేసి సరిపెట్టుకున్నారు.

ఎండుతున్న పంటలు...

ఆరుగాలం కష్టపడే రైతు అతివృష్టి, అనావృష్టితో ప్రతి సంవత్సరం నష్టపోతూనే ఉన్నాడు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండిపోయి పెట్టుబడులు మట్టిపాలై అన్నదాతలు అప్పులపాలయ్యారు. గ్రామాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు వలసలు వెళుతున్నారు. కరువుతో పశువులకు మేత లేక పాడిపోషకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు మేత లేక అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో రైతులు వేసిన పంటలు వర్షాలు లేక 90 శాతం ఎండిపోయాయి.

ప్రజా రక్షణ భేరి జయప్రదానికి..

ఈ నెల 15న విజయవాడలో అసమానతలు లేని అభివద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ విజయవంతానికి జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి విజయవాడ తరలివెళ్లారు. కర్నూలులో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు నిర్వహించారు. నంద్యాలలో బైక్ ర్యాలీ చేపట్టారు.

అవీ..ఇవీ..అన్నీ...

మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అఖిలభారత సహకార వారోత్సవాలు జరిగాయి. వైసిపి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 'ఏపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాలు చేపట్టారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల పట్టణంలోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. ఈ దీక్షలను ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చే ముందు 'నేను ఉన్నాను-నేను విన్నాను, మీ కుటుంబంలోని పెద్దకొడుకులా, ఒక అన్నగా ఉంటానని, మీ జీవితంలో వెలుగులు నింపుతా' అని చెప్పిన మాటలు మరిచి నాలుగున్నర సంవత్సరాల పూర్తయినా నేటి వరకు ఒక్క హామీని అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. రిలే నిరాహార దీక్షల అనంతరం వైసిపి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా ముఖ్యంగా మహిళలంతా కలిసి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా బటన్ నొక్కి ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. వేతనంలో సగం పెన్షన్ ఇవాలని, ఫ్రీస్కూల్ బలోపేతం చేయాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్ల **మిగతా 6వ పేజీలో...**

అంగన్‌వాడీల దీక్షకు మద్దతు తెలియజేసి మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి డాక్టర్ శాంతి

మోడీ ప్రభుత్వంలో ఆర్ఎస్ఎస్ భావజాలం

- సనాతన ధర్మం పేరిట మహిళలను వంటింటి కుందేలుగా మారుస్తోంది
- మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ శాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోకి ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని తీసుకువస్తుందని, సనాతన ధర్మం పేరిట మహిళలను వంటింటి కుందేలుగా మారుస్తోందని మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ శాంతి పేర్కొన్నారు. నంద్యాలలో జరుగుతున్న ఎపి మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను రెండవ రోజు శనివారం కొండపల్లి కోటేశ్వరమ్మ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభించారు. ముందుగా సీనియర్ జాతీయ నాయకురాలు డాక్టర్ సంజీవమ్మ జెండావిష్కరణ చేశారు. రాష్ట్ర నాయకురాలు నక్కి బాలమ్మ అమర వీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షత వహించారు. మహాసభకు ముఖ్యతిథిగా మహిళా సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ శాంతి హాజరై మాట్లాడారు. ఇటీవల మణిపూర్లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలకు జాతి మొత్తం సిగ్గు పడిందన్నారు. బాలికల పెళ్లి వయసును కేంద్ర ప్రభుత్వం 18 సంవత్సరాల నుండి 21 సంవత్స రాలు పెంచిందని, అయితే 18 సంవత్స రాలలోపు బాల్యవివాహాలనే అరికట్టలేక పోతుం దని విమ ర్శించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను పార్లమెంటులో చట్టం చేయడం మంచిదేనని, అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు కేవలం ఎన్నికల్లో లబ్ది కోసమేనని విమర్శించారు. అనంతరం మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గ భవాని, జాతీయ నాయకురాలు అక్కినేని వనజ తదితరులు మాట్లాడారు. ఈ మహాసభలో అరుణ, మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, సంధ్య కుమారి, యామిని, మహిళా సమాఖ్య నాయకులు విమల, బషీరునిసా, సుగుణమ్మ, రాణి, వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నాపరాయి పరిశ్రమల విద్యుత్‌కు

యూనిట్‌కు రూ. 2 తగ్గిస్తాం

- మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి
- గనుల యజమానులతో ఆత్మీయ సమావేశం - పలు సమస్యలను విన్నవించిన యజమానులు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

నాపరాతి పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, నాపరాతి పరిశ్రమకు యూనిట్‌కు రెండు రూపాయలు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన నాపరాయి మైనింగ్ పరిశ్రమల పరిస్థితులపై గనుల యజమానులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డిలు విచ్చేశారు. నాపరాయి మైనింగ్ పరిశ్రమలకు సంబంధించిన సమస్యలపై లీజుదారులు, పరిశ్రమల యజమానులతో చర్చించారు. జీవో-65 ప్రకారం 'డెడ్ రెంట్' కట్టడంలోని ఇబ్బందులను మంత్రులకు నాపరాయి పరిశ్రమ యజమానులు వివరించారు. డెడ్ రెంట్ సంవత్సరంలో ఎప్పుడైనా కట్టే పాత పద్ధతిని మార్చి కొత్తగా ఏడాదిలో నాలుగు సార్లు కట్టడం వల్ల, రాయల్టీ నిధులు వెనక్కి పోతుండడాన్ని మంత్రుల దృష్టికి తెచ్చారు. నాపరాయి పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సిఎఫ్ఓ, సిఎఫ్ఇ, ప్రతి ఏడాది కొనసాగించడం లీజుదారులకు ఇబ్బందికరం, రెన్యువల్‌లా కాకుండా ఒకేసారి కట్టేలా ప్రభుత్వం సహకరించాలని, పరిశ్రమలకు అనుమతుల విషయంలో సరళమైన పాత విధానాలను కొనసాగించాలని యజమానులు కోరారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వందలాది మందికి ఉపాధి కల్పించడంలో నాపరాయి పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వెహికల్ ట్రాకింగ్ సిస్టంపైనా వెసులుబాటు దిశగా సమీక్షిస్తామని చెప్పారు. రెన్యువల్‌పై, డెడ్ రెంట్ మూడు నెలలకోసారి కట్టే పద్ధతిపై యజమానుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతుల విషయంలో నిబంధనలను పాటించాలన్నారు. క్లస్టర్ల ద్వారా పరిశ్రమలు ముందుకువెళ్లాలని, టిడిపి పాలనలో నాపరాయి పరిశ్రమలకు రాయల్టీలు పెరిగినప్పుడు పోరాడి తగ్గించింది తామే అన్నారు. డిఎంఎఫ్' నిధుల ద్వారా బనగానపల్లె మౌలికసదుపాయల కల్పనకు పెద్దపీట వేశామని చెప్పారు. మైనింగ్ ఉత్పత్తుల విషయంలో గడువుపై మరింత అధ్యయనం చేస్తామని తెలిపారు. బనగానపల్లెలో నాపరాతి యజమానులకు ఏ ఇబ్బంది వచ్చినా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారని, సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తెస్తున్నట్లు తెలిపారు. డెడ్‌రెంటు 10 రెట్లు పెట్టారన్న మైనింగ్ యజమానుల వినతిని పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. దీనిని 5 శాతం తగ్గిస్తున్నట్లు తెలిపారు. సిఎఫ్ఇ, సిఎఫ్ఓ విషయంలో మూడేళ్ల గడువును 5 సంవత్సరాలలోపు కట్టుకునేలా పొడిగిస్తామన్నారు. క్వారీడెడ్ రెంటు కాల వ్యవధిపై అధ్యయనం చేసి సానుకూల నిర్ణయం తీసుకుంటమని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో పరిశ్రమ మనుగడ కొనసాగించడం కష్టతరంగా సాగుతుందని, ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు లీజుదారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త శనివారపు వెంకటరామిరెడ్డి, నాపరాయి పరిశ్రమలు, లారీల యజమానులు, లీజుదారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

పసుపు వర్ణ ప్రాధాన్యత వివరిస్తున్న ప్రిన్సిపల్ మాధవిలత

పసుపు శుభానికి సూచన

- బాల అకాడమీలో ఘనంగా పసుపు వర్ణం ఆక్టివిటీ

ప్రజాశక్తి - నంద్యాల

పసుపు వర్ణం శుభానికి సూచన బాల అకాడమీ పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. శనివారం నంద్యాలలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో పసుపు కలర్ ఆక్టివిటీని చిన్నారులు, ఉపాధ్యాయ బృందం ఎంతో ఆసక్తికరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపు వర్ణం దుస్తులు ధరించారు. పసుపు కలర్ వస్తువులు, ఆహార పదార్థాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసుపు వర్ణం తాజాదనానికి, సంతోషానికి, పాజిటివిటీగా, క్లారిటీగా శక్తివంతంగా, ఉత్సాహవంతంగా, నీతికి, నిజాయితీకి సూచకమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాబు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కుష్టు వ్యాధి కేసులు 2027 సంవత్సరం నాటికి జీరోకు వచ్చే లక్ష్యంతో నవంబర్ నెల 2023 నుండి కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, పొడలు, లావుగా మారి నొప్పితో కూడిన నరాలు, కాళ్ళు,చేతుల కండరాలలో బలహీనత తదితర లక్షణాలు వుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాబు

బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్‌డిఆర్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్‌డిఆర్ స్కూల్ విద్యార్థిని కె.హర్షిత ప్రతిభ చాటింది. శనివారం నంద్యాలలోని ఎస్‌డిఆర్ విద్యాసంస్థలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో బాస్కెట్ బాల్ క్రీడాకారిణి కె.హర్షితను ప్రిన్సిపల్ విజయ్ శేఖర్, ఛైర్మన్ శనివారపు కొండారెడ్డిలు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్ శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మదనపల్లిలో జరిగిన 67వ అండర్-14 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో కె.హర్షిత కర్నూలు జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిందని తెలిపారు. కర్నూలు జిల్లాను మూడవ స్థానంలో నిలుపుటలో ముఖ్యపాత్ర పోషించిందని చెప్పారు. ఛైర్మన్ శనివారపు కొండారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బాస్కెట్ బాల్ క్రీడలో మూడవస్థానం సాధించిన కె.హర్షితను అభినందించారు. ఇకముందు జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. హర్షితని క్రీడలలో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. విజయానికి కారణమైన కోచ్ ముక్కమల్ల నవీన్ కుమార్‌ను అభినందించారు.

క్రీడాకారిణి కె.హర్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విజయ శేఖర్

27, 28వ తేదీల్లో మహాధర్నా

- జయప్రదం చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - పాణ్యం

ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడలో కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం జరిగే మహాధర్నాలో పాణ్యం మండలంలోని రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, మండల నాయకులు ప్రసాద్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, మండల నాయకులు కే భాస్కర్‌లు కోరారు. మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పాణ్యం, పిన్నాపురం, నెరవాడ గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు, పేదల పాలిట ఉరితాడులా మారే ఎలక్ట్రిసిటీ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు ఫ్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పని ప్రదేశంలో సమానత్వాన్ని, భద్రతను పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులను రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్ తోపాటు సామాజిక భద్రత కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ కల్పించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వేస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ పని కల్పించాలని, కౌలురైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు సుబ్బయ్య, నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, సిఐటియు నాయకులు రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

వైసిపి పాలనకు చమర గీతం పాడాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి రాక్షస పాలనకు చమర గీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని అప్పలాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు, జగన్ కవల పిల్లలని, సైకో సిఎం పాలనలో 122 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా కరువు వచ్చినా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి, జనసేన నాయకులు సురేష్ బాబు, టిడిపి నాయకులు రామాంజనేయరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

విద్యార్థిని సమీరాకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ప్రతిభకు పేదరికం అడ్డు కారాదు

- దూదేకుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, జంప్‌రోప్ క్రీడలలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సమీరాకు చేయూతను అందించాలని ఎపి దూదేకుల సంఘం రాష్ట్ర మాజీ ఛైర్మన్ డాక్టర్ పి.బాబన్ పేర్కొన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన జంప్ రోప్ పోటీల్లో ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సమీరా ప్రథమ స్థానం సాధించి డిసెంబర్‌లో బ్యాంకాంక్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా దూదేకుల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక నూర్ నర్సింగ్ హెూమ్ ఆవరణంలో విద్యార్థిని సమీరాకు రూ. 40 వేలు ఆర్థికసాయం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హుస్సేనప్ప, దూదేకుల సంఘం నంద్యాల పట్టణ కార్యదర్శి ఆదాం సాహెబ్, కోశాధికారి సోమశేఖర్, కార్యవర్గ సభ్యుడు గబ్బర్ అండ్ సన్స్ దస్తగిరి, చాగలమర్రి మండల నాయకులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి : ఎఓ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రైతులు రబీ సీజన్లో వరి పంటను ఎట్టి పరిస్థితుల్లోనూ వేసుకోవద్దని, ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఎఓ కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మిట్టపల్లి, అహెూబిలం, బాచేపల్లి గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల రబీ పంటకు తెలుగు గంగకు, కేసీకి నీరు రాదన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కిషోర్ కుమార్ రెడ్డి

బుగ్గనతో మంత్రి పెద్దిరెడ్డి భేటీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నివాసంలో రాష్ట్ర గల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాపరాయి మైనింగ్, పాలిష్ పరిశ్రమలకు సంబంధించిన పలు విషయాలను సమావేశంలో ఇరువురు మంత్రులు చర్చించినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రస్తుతం రాష్ట్రంలో జరుగు తున్న రాజకీయ పరిణామాలు భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు వంటి చర్చలు జరిగినట్లు తెలిసింది. ఇరువురు మంత్రుల సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, జడ్పిటిసి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి బుగ్గనతో భేటీలో మంత్రి పెద్దిరెడ్డి కలెక్టర్

జలశుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని బుగ్గానపల్లి తాండ సమీపంలో సుమారు 8 ఎకరాలలో నిర్మిస్తున్న జలశుద్ధి కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 340 కోట్ల రూపాయలతో గోరుకల్లు రిజర్వాయర్ నుండి డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాలలో గల ప్రతి గ్రామానికి శుద్ధ జలాన్ని సాధ్యమైనంత త్వరలో అందజేయడం జరుగుతుందన్నారు. డోన్ నియోజకవర్గంలోని ప్రజల దాహార్తిని ప్రభుత్వం గ్రహించి ఈ పథకాన్ని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి గ్రామం నుండి మండల కేంద్రానికి రహదారులను ఎంతో వ్యయ ప్రయాసలతో అభివృద్ధి చేయడం జరిగిందని, అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం, బేతంచెర్ల మండలంలో ప్రభుత్వ ఇంటర్ డిగ్రీ ఐటిఐ పాలిటెక్నిక్ కాలేజీల నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్న ప్రతిపక్ష నేతలు నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదనడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మంత్రి పర్సనల్ పిఏ ప్రతాప్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జల శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి

బేతంచర్లలో దొంగల హల్‌చల్...

- ఎనిమిది దుకాణాలలో చోరీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణం అంగళ్ళ బజారులో ఎప్పుడూ లేని విధంగా ఏకధాటిగా 8 దుకాణాలలో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. ఈ షాపులలో దొంగలు ఒక ప్రణాళిక ప్రకారం వరుసగా ఉన్న దుకాణాల షట్టర్లను పగలగొట్టి చోరీ చేశారు. అయితే నాలుగు షాపుల స్వెటర్లు పూర్తిగా పగలగొట్టి షాపులలో జొరబడి చోరీ చేయగా మిగతా నాలుగు షాపుల స్వెటర్లను పాక్షికంగా పగలగొట్టి చోరీయత్నం చేసినట్లు సమాచారం. దుకాణ యజమానులు కొద్ది మొత్తంలోనే నగదు చోరీ అయినట్లు వారు తెలిపారు. బేతంచర్ల ఎస్ఐ శివశంకర్ నాయక్ దుకాణాలలోని సీసీ పుటేజ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్ఐ

రహదారి నిబంధనలు పాటించాలి

వెహికల్ ఇన్స్పెక్టర్ కాంత్ కుమార్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెహికల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్

ప్రజాశక్తి - బేతంచెర్ల

రహదారిపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ప్రమాదాల నివారణకు ప్రభుత్వ రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ సూచించారు. శనివారం నాడు బేతంచెర్ల పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల ఆవరణ నందు సిఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్సై శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారిపై వాహనాలను నడిపే సమయంలో సీటు బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రహదారులపై సూచికలను గమనించి జాగ్రత్తగా వాహనాలను నడిపి ప్రాణాలను రక్షించుకోవాలని వారన్నారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి గడపగడప నిధులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద నిధులను విరివిగా మంజూరు చేయడం జరిగిందని ఆళ్ళగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రిలోని మండల పరిషత్ కార్యాలయంలో గొడిగినూరు, చిన్న వంగలి , మల్లె వేముల గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో అభివృద్ధి పనులు చేపట్టుటకు ఎమ్మెల్యే అధికారులతో, ప్రజా ప్రతినిధులతో వైయస్సార్ కాంగ్రెస్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధికి 20 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఒక్కొక్క సచివాలయానికి 20 లక్షల రూపాయలతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం కింద మరో 20 లక్షల రూపాయలు అందుతాయని తెలిపారు. ఏ గ్రామాలలో ఏ ఏ పనులు చేయాలో సంబంధిత అధికారులతో, సర్పంచులతో, ఎంపీటీసీలతో ఆయన చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని 90 సచివాలయాలకు గాను 73 సచివాలయాలను 14 కోట్ల 60 లక్షల రూపాయల నిధులతో ఆయా సచివాలయాల పరిధిలోని అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వీరభద్రుడు, జిల్లా జేసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, తహసిల్దార్ సుభద్రమ్మ, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, జగ్గయ్య, షఫీవుల్లా, సర్పంచులు సంజీవ రాయుడు, దస్తగిరి రెడ్డి, మౌళి బాష, ఈదుల సరోజమ్మ, ఉపసర్పంచ్ లు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేష రమేష్, మాజీ జెడ్పిటిసి రామగురివీరెడ్డి, సింగిల్ విండ అధ్యక్షుడు దస్తగిరి, కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, వైసిపి నాయకులు బ్రహ్మానందరెడ్డి, జ్యోతి రెడ్డి, పడావుల పెద్ద రాముడు, వెంకట్రామిరెడ్డి, బాబుల్ రెడ్డి, సంజీవ రాయుడు, స్వామి రెడ్డి, దస్తగిరి రెడ్డి వివిధ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భారీగా వైసిపి నుండి టిడిపిలో చేరికలు

త్వరలో మరింత మంది చేరిక : మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో శనివారం రాత్రి వైసిపికి చెందిన మండల యువజన అధ్యక్షుడు దినకర్ నాయకత్వంలో వైసిపి కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు నల్లకాలువ తిరుపాలమ్మ స్వగ్రామం నుండి భారీగా వందలాది మంది కార్యకర్తలు వైసిపి చెందిన కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన భారీ సభలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో అన్ని మండలాల నుండి వైసిపికి చెందిన కార్యకర్తలు మరింత పెద్ద ఎత్తున తెలుగుదేశంలో చేరుతున్నారన్న విషయాన్ని ముందుగానే ప్రకటించాలని, చేతనైతే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆపుకోవాలని ఈ సందర్భంగా మరోసారి సవాల్ విసిరారు. వైసిపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దినకర్ నేడు టిడిపిలో చేరడంతో గ్రామంలో టిడిపి మరింత బలపడిందన్నారు. దినకర్ వైసిపి యువజన అధ్యక్షుడిగా పని చేస్తున్న పుటికీ స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అతనినిపై పోలీసుల చేత అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ ఎమ్మెల్యే బుడ్డా ఆరోపించారు. కరివేన గ్రామం నుండి టిడిపిలో చేరిన ప్రతి ఒక్క కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద్ రెడ్డి, కంచర్ల సురేష్ రెడ్డి, జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష, శివ ప్రసాద్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

బుడ్డా రాజశేఖర్ సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలంలో భక్తుల కిటకిట

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం మొదటి శనివారం నాడు శ్రీశైల క్షేత్రంలో భక్తులతో కిటకిటలాడింది. క్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకు న్నారు. తెలుగు రాష్ట్రాల నుండే గాక కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలు నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం వచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి -ప్యాపిలి

ప్యాపిలి మండలములోని జలదుర్గం గ్రామ శివార్లలో దాడులు జరపగా బొలెరో వాహనంలో కర్నాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బీమలింగ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడి జరిపామని ఒక్కొక బాక్స్ నందు 90 ఎంఎల్ పరిమాణం కలిగిన 96 టెట్రా పాకెట్స్ ఉన్నాయని, మొత్తము 2016 టెట్రా ప్యాకెట్ ఉన్నాయని దీనికి సంబందించిన బంగి రామంజేయులు అను వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా కర్నూలు పట్టణంకు చెందిన ఈడిగ గిరిబాబు కర్నాటక మద్యంను సప్లయ్ చేసాడని తెలిపారు. ఇద్దరి వ్యక్తుల మీద కేసు రిజిస్టర్ చేసి, బొలెరో వాహనమును, ప్రాపర్టీని సీజ్ చేయడం జరిగిందని, పట్టుబడిన మద్యం విలువ సుమారు ఒక లక్ష 20 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ముద్దాయిని హాజరు పరిచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు

ఆళ్లగడ్డ : వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. 'స్వాతంత్ర సమరంలో సమాజంపై గ్రంథాలయాల పాత్ర' అంశంపై వ్యాసరచన, ప్రకృతి అందాలు అంశంపై చిత్రలేఖన పోటీలు గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. అలాగే ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలోనూ వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.సబేరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం గ్రంథాలయంలో క్విజ్ పోటీలు లైబ్రరియన్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్విజ్, వక్తృత్వ పోటీలలో మోడల్, ప్రభుత్వ, కెఆర్ఆర్ స్కూల్, ఎస్‌టి ఆశ్రమం స్కూల్, కస్తూరిబా స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆళ్లగడ్డ గ్రంథాలయాధికారిణి అరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మహాత్మారావు జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, వైపిపిఎం ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఖాజా, గాయత్రీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** పగిడ్యాల గ్రంథాలయములో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. **బండి ఆత్మకూర్ :** విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వారి శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి మధు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక భవిష్య స్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి అధ్యక్షతన క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని వారు సూచించారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని గంథాలయంలో వారోత్స వాను గ్రంథాలయ అధికారి రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. భారతి మందిరం పాఠశాల విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. **పాములపాడు:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పాములపాడు గ్రంథాలయ అధికారి సివి కృష్ణారెడ్డి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ కవులు, దేశ మొదటి ప్రధాని లాంటి వారి జన్మదిన వేడుకల కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముగింపు వేడుకల్లో బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్. ఎం వెంకటసుబ్బమ్మ తెలుగు టీచర్స్ శ్రీనివాసులు, ద్రాక్షాయిని బాయి, శారద మనోరంజని లైబ్రేరియన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు : వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఫిర్యాదులపై విచారణ

పరిశీలిస్తున్న ఆర్‌డిఓ శ్రీనివాస్

ప్రజాశక్తి - చాగలమర్రి

కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రి హైవేకు అనుసంధానం చేసే నేషనల్ హైవే 440 రహదారిలో భూములు కోల్పోతున్న స్థలాన్ని నంద్యాల ఆర్‌డిఓ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ 440 రహదారి నిర్మాణంలో భాగంగా 252/3 సర్వే నెంబర్‌లో 4 రైతులకు సంబంధించిన 59 సెంట్లు భూమిని కోల్పోతున్నార న్నారు. ఈ రహదారి నిర్మాణంలో తమ విలువైన భూములు కోల్పోతున్నామంటూ సంబంధిత రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పరిశీలించడం జరిగిందన్నారు. ఎన్‌హెచ్ ఉన్నతాధి కారులతో కలిసి మరోసారి పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామ న్నారు. ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రా రెడ్డి, మండల సర్వేయర్ మద్దిలేటి, విఆర్‌ఓ వెంకటరామిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

జంప్ రోప్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాగలమర్రి

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైన విద్యార్థి సమీరా చాగలమర్రి మండల నూరు బాషా సంఘం అధ్యక్షులు టైలర్ బాష ఆధ్వర్యంలో నూర్ బాషా సంఘం నాయకులు రూ.36,500 ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా టైలర్ బాష మాట్లాడుతూ ఆర్ కృష్ణాపురం గ్రామానికి చెందిన విద్యార్థి సమీరా డిసెంబర్ నెలలో బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైందన్నారు. సమీరాకు రాష్ట్ర నూర్ బాషా సంఘం గౌరవ అధ్యక్షులు బాబన్ చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని అందజే శామన్నారు. అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికైన సమీరాను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిడి నాగేంద్ర, టీ పీరయ్య ,బి మస్తాన్, ఇమామ్ బాష, జయరాముడు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి సమీరా ను సన్మానిస్తున్న నూర్ బాషా సంఘం నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

5వ పేజీ తరువాయి... ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ పిల్లలకు అమ్మఒడి, యూనిఫారమ్ ఇవ్వాలని చెప్పారు. వైయస్ ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2017 నుండి పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలని, లబ్దిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్, కందిపప్పు క్వాంటటీ పెంచాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలిగించాలన్నారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ మాట్లాడుతూ డిసెంబర్ 8వ తేదీ కల్లా సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎండి గౌసు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సునీత, నాగరాణి, వసంత, వెంకటరమణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కె.సరస్వతి, పి.వెంకటలక్ష్మి, ప్రాజెక్టు కార్యదర్శి ఈ.రోజారమణి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి.సుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు రేణుక, రమాదేవి, మల్లేశ్వరి, సుజాత, శ్రీదేవి, భాగ్యలక్ష్మి ,డైనమ్మ పర్వీన్, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షను చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, కోశాధికారి లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, చెన్నమ్మ, వెంకటలక్ష్మి, ప్రమీలమ్మ, ఫాతిమా, వసంత, ఖైరున్ బి, సావిత్రి, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర చేపట్టిన అంగన్వాడీ వర్కర్స్ రిలే నిరాహార దీక్షలలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్,మండల కార్యదర్శి ఏవి.భాస్కర్ రెడ్డి హాజరు అయ్యారు. రిలే నిరాహార దీక్షలను సందర్శించిన ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు కోయిలకొండ నాగరాజు,మోటార్ వర్కర్స్ యూనియన్ శివరంగస్వామి, రాము, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు హబీబ్ భాషా,నక్కీహరి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష,కార్యదర్శులు మహబూబ్ బాషా,అశోక్, ఆటో యూనియన్ అల్లబకాష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కుల్లాయప్ప,పెద్దఎల్లయ్యలు మద్దతు ప్రకటించి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు డి మదర్ బి మాట్లాడారు. అంగన్వాడి కార్యకర్తలు హరిత, శివలక్ష్మి, పద్మ, ఇందిర, ప్రసన్న, రమణమ్మ, శ్రీలత, స్వాతి, శైలజ, నాగమణి వసంత, శ్రీదేవి, రాజమ్మ, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

నందికొట్కూరు టౌన్ : మాట్లాడుతున్న నాయకులు భాస్కర్ రెడ్డి

డోన్‌లో.. మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శివరాం

బనగానపల్లె : ముందు దీక్షలు నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్ 17 బాలుర కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నందికొట్కూరు ఎంఈఓ ఫైజునిసా శనివారం సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులకు కల్పించిన వసతులను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఫైజునిసా మాట్లాడారు. క్రీడాకారులు వారు ఆడే క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించినప్పుడే విజయం భరిస్తుందన్నారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత తప్పక ఉండాల న్నారు. పూర్తిస్థాయి శిక్షణ పూర్తిచే సుకుని రాష్ట్రస్థాయిలో పోటీల్లో కనబడే ఉమ్మడి కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురా వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు సూదన్ రావు, ఉపాధ్యాయులు రమణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, క్రీడా శ్రీ తోకల పీతాంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎంఈఓ ఫైజునిసా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శనివారం నాడు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత సూచనల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఎస్ రాంబాబు, సిబ్బంది పాల్గొని రక్తదానంపై అపోహలు, భయాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానం చేసినట్లు అవుతుందని తెలిపారు.

NANDYAL MUNICIPALITY

e-procurement Tender Notices No.30/2023-24/E1, Dt.18-09-2023

15వ ఆర్థిక సంఘ నిధులతో రూ. 295.66 లక్షలతో 12 పనికి అర్హులైన కంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును వివరములకు **e-procurement.gov.in** నుండి పొందగలరు.

కమిషనరు,
నంద్యాల పురపాలక సంఘము.

9న జాతీయ లోక్ అదాలత్

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆత్మకూర్

డిసెంబర్ 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి సాయి తేజ పేర్కొన్నారు. శనివారం నాడు కోర్టు ఆవరణలో న్యాయవాదులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కక్ష దారులు రాజీ అయ్యే కేసులకు సంబంధించిన ఇరువురుగా వారిని పిలిచి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆత్మకూర్ కోర్టు పరిధిలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా న్యాయవాదులు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కేశవరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు గిరిరాజు, వెంకటేశ్వర్లు, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సుంకారి ఉమామహేశ్వరి .... వాది
ఎవరూ లేరు .... ప్రతివాదులు

ఇంటిని నెంబరు 28/1088D2 సదరు పుస్తకం డాక్యుమెంట్ నెంబరు 2900/2000 రిజిస్టర్ ను అమ్ముచున్నాము. మైనర్స్ మా నాన్న నాకు అనుమతిని పూర్తి హక్కు ఇచ్చి ఉన్నారు. పిల్లలు చదువుల, అప్పుల కోసం అమ్ముచున్నాను. ఎవరైనా అభ్యంతరం ఉన్నచో తెలుపవలెను. అని పేపర్ ప్రకటన రూపంలో తెలియజేయడం జరిగింది. నంద్యాల జిల్లా రి. నంద్యాల సబ్ రి. నంద్యాల మున్సిపల్ లిమిట్స్ చెందిన ఆస్తి

ఈ క్రింది తెలుపబడిన హద్దులు

వివరం	సర్వే.నెం.	య.సెంట్లు	శిస్తు	హెక్టారు
పుంజి	393/A1A	001.754	0.02	0.007

తూర్పు : మారెబోయిన రంగస్వామి గారి ఇండ్లు
పడమర : రస్తా
ఉత్తరం : రాకపోకలకుగాను ఉండే 6 అడుగుల వెడల్పు రస్తా
దక్షిణం : ఫారెస్ట్ నాగరాజు గారి బయలు స్థలం

ఇట్లు
తమ విధేయుడు
ఎం. వెంకటేశ్వరుడు
అడ్వకేట్ & నోటరీ. నంద్యాల
సెల్. 9440047193